ప్రజాశక్తి
ఆదివారం 4 జూన్ 2023
5
అల్లూరి సీతారామరాజు

ఘాట్ రోడ్డులో నిలిచిన కంటైనర్

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి ఘట్ రోడ్డు డమ్ముకు, బొర్రా జంక్షన్ మలుపు వద్ద భారీ కంటైనర్ నిలిచి పోవడంతో వాహనాలు గంటల తరబడి నిలిచి పోయాయి. శనివారం అరకు నుండి విశాఖకు వెలుతున్న క్రమంలో కంటైనర్ మలుపు తిరుగుతున్న వెనుక చక్రాలు గోతిలో దిగాయి. దీంతో మలుపు వద్ద అడ్డంగా కంటైనర్ నిలిచి పోయింది. దీంతో అరకు నుండి మైదాన ప్రాంతానికి వెళ్లే వాహనాలు నిలిచి పోయాయి. డమ్ముకు మీదుగా. కంభవలస.నుండి బొర్రా జంక్షన్ చేరుకుని ప్రయణికులు రాకపోకలు కొనసాగించారు.

నిలిచి పోయిన వాహనాలు

యాంత్రీకరణతో రైతులకు లబ్ధి

- రూ.3.85 కోట్ల విలువైన 212 వ్యవసాయ పనిముట్లు పంపిణీ
-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో 197 రైతు భరోసా కేంద్రాలున్నాయని, వాటి ద్వారా రైతులు వ్యవసాయ యాంత్రీకరణ లబ్ధి పొందాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక కాఫీ హౌస్ లో ఏర్పాటు చేసిన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలక్టర్ మాట్లాడుతూ, ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఒక కమ్యూనిటీ హైరింగ్ కేంద్రం ఉండాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. తద్వారా నలుగురైదుగురు గ్రూపుగా ఏర్పడి వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు సబ్సిడీపై కొనుగోలు చేసి వారి ఫరిధిలో రైతులకు అద్దెకు ఇచ్చి పంట దిగుబడులు పెందుకోవాలని కలక్టర్ సూచించారు. ఏజన్సీలో మూడు లక్షల ఎకరాలలో వ్యవసాయం జరుగుతోందని, రొటేషన్ పద్ధతిలో యంత్ర పరికరాలు వినియోగించుకోవాలని సూచించారు. యాంత్రీకరణతో దిగుబడి పెరగడమే కాకుండా ఆదాయం పెరుగుతుందన్నారు. ఇతర పథకాలతో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు సబ్సిడీపై అందజేయటం జరుగుతుందని, ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయశాఖాదికారులను సంప్రదించాలని కలక్టర్ కోరారు.

స్థానిక శాశన సభ్యులు కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయాధార కుటుంబాలు ఉన్నాయని, వారంతా పెదవారైనందున తక్కువ ఖర్చుతో ఎక్కువ లబ్ధి చేకూర్చే ఆధునిక వ్యవసాయం వైపు మరలాలని, అందుకు ప్రత్యామ్నాయంగా వ్యవసాయ యాంత్రీకరణ ఉపయోగపడుతుందని వివరించారు. మొదటి దశలో 29 ట్రాక్టర్లను అందించామని, ఇప్పుడు రెండో దశలో మరో 32 ట్రాక్టర్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. **అరకు శాసనసభ్యులు శెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ,**

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో 95 కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాలకు రూ. 3,85,25,363 విలువ గల వివిధ రకాల 212 యంత్రీకరణ పరికరాలను పంపిణీ చేసారు.

లబ్ధిదారుల మనోగతం-

ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. జి.కే. వీధి రింతాడ సచివాలయ ఫరిధిలో రైతు ఎస్.భీమేశ్వర పడాల్ మాట్లాడుతూ, ఐదుగురు సభ్యులం కలసి కేవలం లక్ష రూపాయలు కట్టి ట్రాక్టర్ కొనుగోలు చేసామని, దానిని వినియోగించి సేద్యం చేయటమే కాకుండా అద్దెకు ఇచ్చి ఆ డబ్బును ఋణం తీర్చడానికి ఉపయోగిస్తామని, తద్వారా అధిక దిగుబడి అధిక లాభాలు సంపాదిస్తామని ఆశాభావం వ్యక్త పరిచారు.

చింతపల్లి మండలం చౌడుపల్లి సచివాలయ ఫరిధిలో కోరాబు కరుణానిధి మాట్లాడుతూ, గిరిజన రైతులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి సమయంలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు సబ్సిడీపై అందించడం ఎంతో ఉపయోగకరమని, ఐదుగురు కలసి గ్రూపుగా ఏర్పడి అన్ని రకాల పరికరాలు తీసుకుంటూ ఒకరికొకరు చేదోడుగ సహకరించుకోవడంతో అందరమూ లబ్ధి పొందుతున్నామని ఆనందం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సరస్వతి, సర్పంచ్ ఉషారాణి, డిసిసిబి సిఇఒ వర్మ, జిల్లా వ్యవసాయశాఖాధికారి బిఎస్ఎస్ నందు, ఆ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, పలువురు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఫాల్గుణ

క్లస్టర్ పేరుతో ఆర్‌బికెల కుదింపు?

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మూగజీవులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ఆర్‌బికె కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో, ప్రతి పంచాయతీ సచివాలయ పరిధిలోని మారుమూల గ్రామాల్లో సైతం మూగజీవులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. ఇటీవల సచివాలయ ఆర్బికేల పరిధిలోనున్న లైవ్ స్టాక్ సెన్సెస్‌ను ఆధారంగా చేసుకుని 1500 కన్నా తక్కువ ఉన్న వాటిని క్లస్టర్ పేరుతో అధికారులు కుదింపుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. సచివాలయాల ఏహెచ్ఏ(యానిమల్ అబ్బెండరీ అసిస్టెంట్లు)లకు పోస్టింగులు ఇచ్చేటప్పుడు సచివాలయాల వారీగా అప్పట్లో నియామకం చేపట్టారు. ప్రస్తుతం లైవ్ స్టాక్ సెన్సెస్ తక్కువగా ఉన్న సచివాలయాల నుంచి వేరే చోటికి బదిలీ చేయాలని ఆదేశాలు అకస్మాత్తుగా రావడంతో సచివాలయాల్లో పనిచేస్తున్న ఏహెచ్ఎలు ఆందోళనకు గురవుతున్నారు. మైదాన ప్రాంతంతో పోలిస్తే భౌగోళికంగా కొన్ని మారుమూల గ్రామాలకు ఆర్బికేల నుంచి సుమారు పది నుంచి 15 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అది కూడా కొండలు, గుట్టలు, వాగులు, లోయలు దాటి విధులు నిర్వహించాల్సి ఉంది.

ఇందుకు ఉదాహరణగా స్థానిక మండలంలోని పోతంగి పంచాయతీ ఆర్‌బికే లో సుమారు 38 గ్రామాలు ఉండగా పాములరాయ్, గొడసారు, బిజ్మర వలస

ఆందోళనలో ఏహెచ్‌ఎలు

గ్రామాలు సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. కితలంగి పంచాయితీ ఆర్‌బికే పరిధిలో గాంధ గ్రామం సుమారు 13 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఇటువంటి గ్రామాలు అనేకంగా ఉన్నాయి. దూరం ఎక్కువ ఉండటంతో మూగజీవులకు వైద్య సేవలు అందించడంలో కష్టమవుతుందనీ, ఇటువంటి సమయంలో లైవ్ స్టాక్ సెన్సెస్ ప్రకారం క్లస్టర్ పేరుతో వేరే చోటికి బదిలీ చేయాలని ఆదేశాలు రావడంతో ఏహెచ్‌ఏలు ఆవేదనకు గురవుతున్నారు.

సచివాలయ వ్యవస్థ రాకముందు గతంలో మండలానికి ఒకటి, రెండు పశువైద్య కేంద్రాలు ఉండగా అందులో ముగ్గురు, నలుగురు సిబ్బంది మాత్రమే ఉండేవారు. దీంతో మూగజీవులకు అంతంత వైద్య సేవలు అందేవని, ప్రస్తుతం సచివాలయ ఆర్‌బి కేల ద్వారా మారుమూల గ్రామాల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందుతుండడంతో రైతులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్లస్టర్ విధానంతో ఏహెచ్‌ఏలను గిరిజన ప్రాంతంలో బదిలీ చేయడంతో రోడ్లు లేని మారుమూల గిరిజన గ్రామాల్లో సకాలంలో మూగజీవులకు వైద్య సేవలు అందకుండా పోతుందేమోనని గిరి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విధంగా బదిలీ చేయడంతో ఆర్‌బికెలు కూడా మండల, జిల్లా వ్యాప్తంగా తగ్గుతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు పునరాలోచించి మైదాన ప్రాంతంతో పోల్చకుండా గిరిజన ప్రాంతంలో లైవ్ స్టాక్ సెన్సెస్‌తో సంబంధం లేకుండా మినహాయింపు ఇవ్వాలని పలువురు ఏహెచ్‌ఏలు కోరుతున్నారు.

గిరిజన ప్రాంతానికి మినహాయింపునివ్వాలి

సచివాలయ పరిధిలో లైవ్ స్టాక్ సెన్సెస్ తక్కువగా ఉన్న వాటి నుంచి క్లస్టర్ విధానంతో ఆర్‌బికేల్లో పని చేస్తున్న ఏహెచ్‌ఏలను వేరే చోటికి బదిలీ చేయాలన్న విధానాన్ని గిరిజన ప్రాంతానికి మినహాయింపు నివ్వాలి. భౌగోళికంగా గిరిజన ప్రాంతంలో ఆర్‌బికె కేంద్రాల నుంచి పది నుంచి, పదిహేను కిలోమీటర్లు దూరం వరకు గ్రామాలు ఉన్నాయి. దీంతో, పాటు కొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా లేకపోవడంతో విధి నిర్వహణ కష్టతరంగా ఉంటుంది. పోస్టింగు నియామకాలు సచివాలయ వారీగా నియమించారు. గిరిజన ప్రాంతంలో క్లస్టర్ విధానం నుంచి మినహాయింపు నివ్వాలి.

తశెట్టి త్రినాధరావు,
సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

పట్టుబడ్డ గంజాయి, నిందితులతో సీలేరు పోలీసులు

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు

అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల్ని శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.... ముందస్తు సమాచారం మేరకు జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో చెక్‌పోస్టు వద్ద పోలీస్ సిబ్బంది శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. దారకొండ వైపు నుంచి తెలంగాణ రిజిస్ట్రేషన్ కలిగిన కారును సీలేరు జెన్కో చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఆ కారులో 10 కేజీలు గంజాయిని గుర్తించారు. గంజాయితో పాటు నిందితుల నుంచి 2 సెల్ ఫోన్లు, రూ.650 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కె.రాకేష్, మణిదీక్షిత్, విక్రమ్ అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి అక్రమ రవాణాలో ప్రమేయం ఉన్నవారు, సహకరించిన వారిపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్ఐ తెలిపారు.

వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు

వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి వాలంటీర్లకు శాలువ కప్పి ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలన్నీ ప్రజల వద్దకే నేరుగా అందుతున్నాయని తెలిపారు. ప్రతినెల ఒకటో తేదీ రాగానే పింఛన్‌దారులకు నేరుగా ఇంటివద్దుకే వచ్చి పెన్షన్ అందజేస్తున్నారని పేర్కొన్నారు. వారికిచ్చే రూ.5000 గౌరవ వేతనంతో పాటు ప్రతి ఏలా ఇలాంటి పురస్కారాలు ఏర్పాటు చేసి వారు చేసే సేవకు గుర్తింపు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మీ, జెడ్పిటీసి ఒడుగుల జ్యోతి, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, వైస్ ఎంపిపిలు జె.రాజేశ్వరి, చప్పా చంద్రరాణి, ఎంపిడిఓ కె బాపన్నదొర, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఆ పార్టీ నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని తుమ్మిలేరు పంచాయతీ పోచవరం గ్రామంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు అక్రోజు భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ వడ్డానపు భాగ్యలక్ష్మి సమక్షంలో శనివారం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ముర్ల మంగిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, ఎంపీటీసీ వాళ్ళ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ టిడిపి మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజల భవితకు భరోసా ఇచ్చేదిలా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అందెల సీతారామరాజు రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎండి రహీం, పార్టీ నాయకులు బీరక సూర్యప్రకాశరావు, అచ్చిరాజు, పెందుర్తి సుదర్శన్‌రావు, కోట్ల శ్రీను, గొంది చంద్రయ్య, రేవు సింహాచలం, బోధిబోయిన సురేష్, అకోజు రంగాచారి, గోపాలరావు, కనకారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ ఈత పోటీలకు 'సంస్కృతి' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 12 వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి ఈత పోటీలకు పరవాడ మండలం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ చెందిన 12వ తరగతి విద్యార్థి ఎస్.నిఖిల్ ప్రకాష్ ఎంపికయ్యారు. ఈయన తిరుపతిలోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జనవరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 400 మీటర్ల ఫ్రీ- స్టైల్, 200 మీటర్ల బట్టర్ ఫ్లై ఈత పోటీల్లో రజిత పతకం సాధించి అండర్-19 విభాగంలో జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎన్.సీతాలక్ష్మి వెల్లడించారు. పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్, స్విమ్మింగ్ కోచ్ జి.మధుబాబు దగ్గర శిక్షణ పొందుతున్న నిఖిల్ ప్రకాష్ ఆటలతో పాటు గాయకుడుగా, చదువులోనూ రాణిస్తున్నాడు. ఈ విద్యార్థి ప్రతిభకు మెచ్చి పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి రూ.5వేలు నగదు బహుమతిని అందజేశారు. సీఈవో నిశాంత్, కోచ్‌లు హరినాథ్ రెడ్డి, బషీర్, కో-ఆర్డినేటర్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



నిఖిల్ ప్రకాష్

సారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

55 లీటర్ల సారా ధ్వంసం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో పాడేరు ఏఎస్పీ దీరజ్ ఆధ్వర్యంలో 2022వ సంవత్సరంలో పట్టుబడిన 55 లీటర్ల సారాని శనివారం పెద్దల సమక్షంలో ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలమామిడి సర్పంచ్ రామకృష్ణ, లువాసింగి ఎంపిటిసి గబ్బాడి సన్యాసిదొర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-అరకులోయ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక స్కిల్ హబ్ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఐటిఐ స్వచ్ఛ భరత్ క్యాంపెయిన్ ప్రోగ్రాం కింద 40 మంది స్టూడెంట్స్‌తో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేసినట్లు అల్లూరి జిల్లా నైపుణ్య అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. పిచ్చి మొక్కలు తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ డి. వెంకటేశ్వరరావు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ జి. సురేష్, స్కిల్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రం చేస్తున్న విద్యార్థులు

నవజాత శిశువులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రూ 6.50 లక్షల వ్యయంతో నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆధునీకరించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మితో కలిసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు కల్పించాలని వైద్యాధికారులకు ఆదేశించారు. చిన్నపిల్లలకు ప్రత్యేకంగా ఐసీయూ ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతంలో శిశు మరణాలు సంభవించకుండా నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు చిన్నారులకు అవసరమైన ఔషధ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. శిశువులు జన్మించిన వెంటనే వారికి అందిస్తున్న తరహా వైద్య సేవలను ఆయన వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆసుపత్రిలో వార్డులను పరిశీలించి రోగులను పరామర్శించి వారికి వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నిరంతరం వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రి రెండవ అంతస్తులో మరో 30 పడకలతో వార్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ సూచించారు. రెండవ అంతస్తులో అదనపు వార్డు నిర్మాణానికి భవన సామర్థ్యాన్ని పరిశీలించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పాడేరు శాసనసభ్యురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. చిన్నారులకు జిల్లా ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్ట అధికారి అభిషేక్ ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ టి.నర్సింగ్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.కృష్ణారావు, చిన్నపిల్లల వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల ఏర్పాటుకు తగు చర్యలు

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రహదారులు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లతో పిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల ద్వారా అన్ని మండలాలలో మారుమూల గ్రామాలకు మంజూరైన రోడ్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కొక్క మండలంలో ఎన్ని బీటీ రోడ్లు, ఎన్ని సీసీ రోడ్లు ఎన్ని మెటల్ రోడ్లు మంజూరైనవి, వాటి నిర్మాణం ఏ దశలో ఉన్నది ఆరా తీశారు. పనులు ప్రారంభించి మధ్యలో మానేసిన కాంట్రాక్టర్లను తొలగించాలని సూచించారు. మంజూరైన రోడ్ల మార్గాల్లో ఎన్ని కల్వర్టు, వంతెనలు ఏర్పాటు చేయవలసి ఉన్నదో అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోడ్లకు ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చింది, ఇంకా ఎన్ని రోడ్లకు రావాల్సి ఉన్నది మండలాల వారీగా తెలుసుకున్నారు. మంజూరైన రోడ్లను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు పెండింగ్‌లో ఉన్న పనులన్నీ వెంటనే పూర్తి చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్ రాజ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, గౌతమి, దుర్గ ప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, భాను, ఉమామహేశ్వరరావు, పి.వెంకటరమణ, నాగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

అంగన్‌వాడీ కేంద్రానికి సిమెంటు రేకుల వితరణ

ప్రజాశక్తి -చింతూరు

మండలంలోని మారుమూల గ్రామమైన ఏడువురాళ్లపల్లి అవుట్ పోస్ట్ పరిధిలో పావురాలు లంక గ్రామంలో పూరిపాకలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రానికి రూ.25వేలు విలువైన సిమెంటు రేకులను శనివారం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ చేతుల మీదుగా పోలీస్ వారి సారధ్యంలో అందజేశారు. చింతూరు సిఐ అప్పలనాయుడు. ఎస్సై శ్రీనివాసరావు పావురాలు లంకలో పూరి పాకలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రానికి సిమెంట్ రేకులను తీసుకువెళ్లి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ అప్పలనాయుడు మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ రేకులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీని వల్ల వర్షాకాలంలో చిన్నపిల్లలు కేంద్రానికి క్రమం తప్పకుండా వచ్చే సౌకర్యాన్ని కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సమస్యను జమాల్ ఖాన్ తెలిపిన వెంబటే స్పందించి తమ అభ్యర్థన మేరకు సహకారాన్ని అందించినందుకు గాను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

సిమెంట్ రేకులు వితరణ చేస్తున్న ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కెవివి.దుర్గ ప్రసాద్ శనివారం ఒక ప్రకటన తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి, ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు గ్రూపులు ఉన్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ఐసిడిఎస్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీగౌరి ఒక ప్రకటనలో తెలిపారు. గొలుగొండ మండలం అప్పన్నపాలెంలో మినీ కార్యకర్త (ఎస్టీ), గొలుగొండ మండలం కొంగసింగి-1 సహాయకురాలు (బిసి-ఎ), నాతవరం మండలం బుచ్చింపేట సహాయకురాలు (ఎస్సీ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హత గల వారు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నేరుగా లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా కార్యాలయంలో అందజేయాలన్నారు.

7న గంటందొర వర్ధంతికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-గొలుగొండ:'విప్లవజ్యోతి' అల్లూరి సీతారామరాజు పితూరీలో సేనాపతిగా పని చేసిన గాం గంటం దొర 99వ వర్ధంతి కృష్ణదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కులో అల్లూరి, గంటం దొర సమాధుల వద్ద ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, గిరిజన నాయకులు శ్యామల వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

మట్టి, గ్రావెల్ తవ్వకాలపై అదుపు ఏదీ? : అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలో అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, ఎమ్మెల్యే అనుచరులు వీటికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. బలిఘట్టం బ్రహ్మ లింగేశ్వర స్వామి దేవాలయ సమీపంలోని విశాఖ రహదారిని మాదిరిగా తయారు చేశారని సెల్ఫీ ఫోటోతో విమర్శించారు. పవిత్ర ఆధ్యాత్మిక ప్రాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే బలిఘట్టం ప్రాంతంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు తవ్వి వైసిపి నాయకులు జేబులు నింపుకుంటున్నారని తెలిపారు. ఆఖరికి ప్రకృతిని కూడా వైసిపి నాయకులు వదలలేదని విమర్శించారు. ఇప్పటికైనా మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు దృష్టి సారించి అక్రమార్కులను అరికట్టాలని ఆయన తెలిపారు.

పశు నష్ట పరిహారం విడుదల

ప్రజాశక్తి-మాడుగుల:వైఎస్ఆర్ పశు నష్ట పరిహారం నగదు విడుదల అయినట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. 2020 జూన్ నుండి 2021 జూన్ వరకు ఈ మధ్యకాలంలో మరణించిన పశువులకు 20 లక్షల 10 వేలు ఉమ్మడి జిల్లా సంయుక్త సంచాలకుల కార్యాలయం నుండి నగదు 70 మంది పాడి రైతుల ఖాతాలకు జమ అయ్యాయని తెలిపారు. 2021 జూలై నుండి అక్టోబర్ నెలలో మరణించిన పశువులకు సైతం త్వరలో నగదు విడుదల కానుందని తెలిపారు.

రైతులకు రుణాలు

ప్రజాశక్తి-మాడుగుల: సకాలంలో రుణం చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని మాడుగుల పిఎసిఎస్ అధ్యక్షులు పెరుమాళ్ల వెంకటరావు కోరారు. 2020-21 సంవత్సరాలకు గాను 389 మంది రైతులకు 8 లక్షల 73 వేల 300 మంజూరు కాగా శనివారం సహకార సంఘ భవనం వద్ద రైతులకు నగదు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రుణం పొందిన రైతులు సంఘానికి సమయానికి తిరిగి చెల్లిస్తే రాయితీ పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర కావలి, శ్రీనాథ్ శ్రీనివాసరావు, మహేశ్వర, బొమ్మిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలకు వినతి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని రామన్న పాలెం గ్రామంలో శనివారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు కాలనీ ఇళ్ల స్థలాల మంజూరుకు గ్రామస్తులు వేడుకున్నారు.కాలనీ లేఅవుట్ వద్ద నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు మొరపెట్టుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. కాలనీలో పారిశుధ్యం మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అరుణశ్రీ, ఎంపిపి దత్తుడు రాజు, ఎంపిడిఒ చంద్రశేఖర్, తహసీల్దార్ జానకమ్మ, స్థానిక సర్పంచ్ చినఅప్పన్న, ఇంజనీర్లు, సర్పంచ్ ఎంపిటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సైకిల్ డేపై అవగాహన

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలోని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామ సచివాలయాల్లో వరల్డ్ సైకిల్ డే సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించామని మెడికల్ ఆఫీసర్ ఎస్ఎస్‌వి శక్తిప్రియ, ఎస్.వాసంతి తెలిపారు.

నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాల సమస్యలను పరిష్కరించాలి

ఎపి గిరిజన సంఘం నేతలు వెంకన్న, గోవిందరావు

గిరిజన సంఘం, 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-కొత్తకోట:నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చాలని, నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఏ ఏర్పాటు చేయాలని, గిరిజన సమస్యలపై ప్రత్యేకించి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో నర్సీపట్నం కేంద్రంగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేస్తూ రావికమతం మండల కేంద్రంలో అనకాపల్లి జిల్లా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం, 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో శనివారం మూడవ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక గిరిజన సంఘం ప్రతినిధులు తోకల అప్పారావు, బూరిగ నూకరత్నం అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర కార్య వర్గ సభ్యులు డి. వెంకన్న, విశాఖ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు కె. గోవిందరావు తదితరులు మాట్లాడుతూ, నాన్ షెడ్యూల్ మండలాల్లో 9 మండలాలు, 261 గ్రామాలు ఏజెన్సీని ఆనుకొని ఉన్న గిరిజన సమస్యలపై ఐటిడిఏ సిబ్బంది, అనకాపల్లి జిల్లా కలెక్టర్ పట్టించుకోలేదన్నారు. దీంతో, జగనన్న భూ సర్వేలో గిరిజనుల పట్టా భూములో గిరిజనేతలకు పట్టాలు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రానున్న కాలంలో గిరిజనులు ఐక్యంగా పోరాడటంతో గిరిజన సమస్యలు పరిష్కారం అవుతాయని పిలుపునిచ్చారు.నాన్ షెడ్యూల్ ఏరియాలో గిరిజనులకు నేటికీ గిరిజనులుగా గుర్తింపు పొందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో గిరిజనులను 5వ షెడ్యూల్లో చేరుస్తామని ఓట్లు వేసుకొని గెలిచిన తర్వాత ముఖం చాటేస్తున్నారన్నారు. గిరిజన సాగు భూములను గిరిజనేతర రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఆక్రమించుకుంటున్నా రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు.నేటికీ కుల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ఆదివాసీలు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జీడి మామిడి రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.నాన్ షెడ్యూల్ గిరిజనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభి స్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ మూర్తి, తొమ్మిది మండలాల నుంచి గిరిజన సంఘం ప్రతి నిధులు పలువురు పాల్గొన్నారు.

4 నుంచి మహిళా టి20 క్రికెట్

ప్రజాశక్తి -పిఎం పాలెం : మహిళా టి20 క్రికెట్ మ్యాచ్‌లు ఈ నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నార్తు జోన్ అకాడమీ మైదానం విజయనగరంలో నిర్వహిస్తున్నారు. మహిళా క్రికెట్ టోర్నీ టి20కు సంబంధించి పిఎం.పాలెంలోని ఎసిఎ- విడిసిఎ క్రికెట్ స్టేడియంలో శనివారం సాయంత్రం ఆంధ్రా క్రికెట్ స్టేడియంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ టి20 క్రికెట్ టోర్నమెంట్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా జబర్దస్త్ ఫేం రష్మీ పాల్గొన్నారు. అనంతరం ఎసిఎ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన మహిళ టి20 సీజన్ 1 గతంలో నిర్వహించామని, ఈ సీజన్‌లో కూడా ఐపిఎల్ నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. గత ఏడాది మహిళా టి20 నిర్వహించిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే ఈ టి20లో నాలుగు జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సిఇఒ శివారెడ్డి పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న గోపీనాథ్‌రెడ్డి, జబర్దస్త్ ఫేమ్ రష్మీ

మట్టి తవ్వకాలు నిలుపుదల చేయాలి

ఒడ్డిమెట్ట వద్ద గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని దేవవరం పరిధిలో ఆవ చెరువులో మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.ఏసు డిమాండ్ చేశారు. శనివారం గ్రామస్తులు, రైతుల ఆధ్వర్యంలో ఒడ్డిమెట్టలో మట్టి రవాణా చేస్తున్న ట్రిప్పర్లు ఎదురుగా ఆందోళన చేపట్టారు. మట్టి రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. మట్టి తవ్వకాలకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మట్టి తవ్వకాలకు అనుమతులు పొందిన దానికి విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. 3,4 రోజుల నుండి తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించు కోలేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి శివ, నరసింగరావు, వెంకట గణేష్ తదితరులు పాల్గొన్నారు .

వింత వాతావరణం

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో శనివారం వింత వాతావరణం నెలకొంది. ఉదయం సమయం లో దట్టంగా మంచు కురియగా, మధ్యాహ్నం నుండి యధావిధిగా భానుడు తన విశ్వరూపాన్ని చూపాడు. ఎండ వేడిమితో పాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు.మంచు కురిసిన వేళలో కూడా ఉక్కపోత యధావిధిగా ఉండడంతో మండల వాసులు అవస్థలు పడ్డారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

వేర్వేరు చోరీ కేసుల్లో నిందితులను శనివారం పోలీసులు పట్టుకున్నారు. కేసుల వివరాలను నగర పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ్ వర్మ మీడియాకు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 1 రాత్రి 10:30 గంటలకు విజయనగరం టిపి సీతారామయ్య వీధికి చెందిన కె.జయ విశాఖపట్నం రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీనివాస కల్యాణ మండపం సమీపాన నడుచుకుని వెళ్తుండగా ఆమె మెడలోని రూ.1,50,000 విలువైన మూడు తులాల బరువు కలిగిన బంగారం గొలుసు, నల్లపూసల తాడును గుర్తుతెలియని వ్యక్తి దొంగలించాడు. ఈ మేరకు ఆమె శనివారం ఉదయం ఫిర్యాదు చేయగా పోలీసులు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పుట్ట సతీష్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మే 21 అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తమ ఇంట్లో ప్రవేశించి ఏడు తులాల బంగారు ఆభరణాలు, ఒక లెనోవా ట్యాబ్, ఎంఐ సెల్‌ఫోన్, వెండి పట్టీలు, దొంగతనం చేశారని రాంనగర్ ప్రాంతానికి చెందిన సుండి ప్రసాద్ ఫిర్యాదు చేయగా పోలీసులు సాంకేతిక ఆధారాల లభ్యతతో విచారణ అనంతరం విశాఖపట్నం వన్ టౌన్ ఏరియాకు చెందిన ఆత్మకూరి కృష్ణను అరెస్టు చేశారు.

వ్యక్తిపై అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టడాన్ని అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై ఆరిలోవ పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బిటిఆర్ నగర్‌లో సర్వే నెంబరు 55లో కొండ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారు. తహశీల్దారు ఆదేశాల మేరకు నిర్మాణాన్ని తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై మొల్లి హేమంత్‌కుమార్ దుర్భాషలాడి, దాడి చేసిన సంగతి తెలిసిందే. రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎసిపి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులలో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను డిఆర్‌డిఎ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీపతి ఆదేశించారు. శనివారం ఎంపిడివో కార్యాలయంలో మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇంకా జగనన్న ఇళ్ళు పూర్తి కాలేదని ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నప్పటికీ పనులు ఎందుకు పూర్తి కాలేదని ఆయన పలువురు సచివాలయ సిబ్బందిని ప్రశ్నించారు. గుడివాడ, పెదఉప్పలం, కోనవానిపాలెం, లింగరాజుపాలెం గ్రామాల్లో జగనన్న ఇళ్ళు, నాడు నేడు పథకం ద్వారా మంజూరైన పాఠశాల మరమ్మత్తులు, నూతన పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.గ్రీన్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం అందచేస్తున్న పుస్తకాలు, స్కూల్ బ్యాగులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీరామ చంద్రమూర్తి, ఈవోపిఆర్డి సత్యన్నారాయణ, మండల విద్యాశాఖాధికారి మూర్తి, హౌసింగ్ ఎఇ ప్రసాద్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాల వేగవంతానికి కృషి

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రభుత్వ భవనాలు, జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు ఆదేశించారు. మండలంలో శనివారం లింగంపేట సిహెచ్.నాగాపురం, కృష్ణదేవిపేట గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. లింగంపేటలో నిర్మిస్తున్న అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి నిర్మాణం త్వరగా పూర్తయ్యేటట్టు చూడాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. కృష్ణదేవిపేట సచివాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి నిర్మాణాలు వేగవంతంగా పూర్తి అయ్యేటట్లు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి రఘురాం, పంచాయతీ కార్యదర్శులు అప్పారావు, కిరణ్మయి, లింగంపేట సర్పంచ్ తోకల సంతోష్ కుమార్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి త్రివిక్రమ వర్మ

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో 'మహదేవ్ బుక్' పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కేసు వివరాలను సిపి సిఎం త్రివిక్రమ వర్మ మీడియాకు వెల్లడించారు. ఆయన కథనం మేరకు పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధి మధురవాడ లాస్ట్ బస్‌స్టాప్ దగ్గరలో అజిత్ కుమార్ అనే వ్యక్తి రెండు నెలల క్రితం ఆన్లైన్ గ్రోసరీ బిజినెస్ పేరిట మూడు అంతస్తుల ఎస్పార్ గెస్ట్ హౌస్‌ను అద్దెకు తీసుకున్నాడు. అక్కడ సుమారు 20 మంది ఉంటూ ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. అందిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, సైబర్ క్రైమ్ పోలీసులు దాడి చేసి 19 మందిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఈ సైబర్ క్రైమ్ బయటపడింది. మహదేవ్ బుక్ ఆన్‌లైన్ గేమింగ్ అనేది ఒక వెబ్ ప్లాట్‌ఫామ్. భారతదేశంలో నిషేధించినప్పటికీ ఇతర దేశాల్లో ఇది చలామణిలో ఉంది. ఈ ప్లాట్‌ఫాం వివిధ బెట్టింగ్ యాప్‌లకు మూలం. విశాఖలో చిక్కిన ముఠాలో ప్రధాన నిందితుడు సౌరబ్ చంద్ర పరారీలో ఉన్నాడు. ఆయన తరచుగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసం మారుస్తూ ఉంటాడు. తక్కువ మొత్తానికి ఎక్కువ లాభం ఆశ చూపించి, తద్వారా నమ్మించి ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టిన తర్వాత, లాస్ అయినట్టు చూపించి కాజేస్తూ ఉండటం ఇతని గ్యాంగ్‌కు అలవాటు. ఒకవేళ గెలిచినా డబ్బులు అవతలివారికి చేరకుండా అకౌంట్స్ ఐడిలను బ్లాక్ చేస్తారు. ఈ ముఠా వెనుక ఉన్నటువంటి ప్రధాన నిందితుడు ప్రతిక్ మిశ్రా కోసం కూడా పోలీసులు గాలిస్తున్నట్టు సిపి తెలిపారు. అరెస్ట్ చేసిన వారి నుంచి 53 సెల్‌ఫోన్లు, ఏడు ల్యాప్‌టాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.5 కోట్ల నగదు కలిగిన 14 బ్యాంక్‌లకు చెందినా 71 అకౌంట్లను సీజ్ చేశారు. కేసు దర్యాప్తులో చురుకుగా పని చేసిన టాస్క్‌ఫోర్స్ ఎసిపి త్రినాధరావును, సైబర్ క్రైమ్ సిఐ భవాని ప్రసాద్‌ను, సిబ్బందిని ఈ సందర్భంగా కమిషనర్ అభినందించారు.

మిషనరీ భూముల కబ్జా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగర పరిధిలోని మిషనరీ భూములను కబ్జా చేసింది జగన్ ప్రభుత్వమేనని టిడిపి విశాఖ పార్లమెంట్ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు ఉరుకూటి డేవిడ్ ఆరోపించారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిల్ క్రిస్ట్ బంగ్లా సిబిఎస్‌సి భూములపై త్యాగరాజు రత్నాకర్ ఎటువంటి హక్కు దారుడూ కాదన్నారు. కేవలం రిసీవర్‌గా మాత్రమే ఉన్నారన్నారు. ఆ భూమిపై 35 సంవత్సరాలుగా వివాదాలు ఉన్నాయని, ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. ఒకవేళ ఎవరైనా లాభం కోసం ఎవరికైనా క్రయం చేస్తే వారే నష్టపోతారని చెప్పారు. లింక్ డాక్యుమెంట్స్ లేకుండా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికీ సుప్రీంకోర్టులో స్టే ఉందన్నారు. సమావేశంలో లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి మణికుమార్, జాషువా, రాజ్ కుమార్, చిన్ని కుమార్ కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పర్సా సత్యనారాయణ శత జయంతి సభ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిఐటియు ఉద్యమ నిర్మాతల్లో ఒకరు, ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి అధ్యక్షులు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల ప్రారంభ సభ ఆదివారం ఉదయం 10.30 గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నాలుగో అంతస్తులో జరుగుతుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలో సంఘం రాష్ట్ర, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

విశాఖలో విషాదఛాయలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శుక్రవారం సాయంత్రం బాలాసోర్ వద్ద ప్రమాదానికి గురైన హౌరా - చెన్నయ్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా వాసులు అధికంగా ఉండటంతో అంతటా విషాదఛాయలు అములుకున్నాయి. అధికారులు జిల్లా వాసులెవ్వరూ మృతిచెందలేదని చెబుతున్నా.. ప్రమాద తీవ్రతను బట్టి విశాఖ వాసులు అధికంగానే ఉండే అవకాశముంది. మరోవైపు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో పయాణిస్తున్న విశాఖకు చెందిన ప్రయాణికుల సంఖ్యపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ రైల్లో విశాఖకు చెందిన ప్రయాణికులు అన్ని కోచ్‌ల్లో కలుపుకుని 110 మంది ప్రయాణిస్తున్నారని రైల్వే శాఖ అధికారులు తెలియజేయగా.. విశాఖపట్నం కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ఇచ్చిన గణాంకాలు దానికి భిన్నంగా ఉన్నాయి. జిల్లా అధికార యంత్రాంగం చెబుతున్న దాన్నిబట్టి చూస్తే 309 మంది ప్రయాణికులు విశాఖకు చెందినవారు ఉన్నట్టు తెలుస్తోంది. అందులో 165 మంది క్షేమంగా ఉన్నారని, 11 మందికి స్వల్ప గాయాలయ్యాయని, 76 మంది అందుబాటులో లేరని ప్రభుత్వాధికారులు చెబుతున్నారు. ప్రమాద నేపథ్యంలో రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్ వద్ద సరైన సమాచారం ఎవరికీ అందలేదు. రైల్వే శాఖ అడుగడుగునా గోప్యత పాటిస్తూ వచ్చింది. సుమారు 2500 మంది ప్రయాణికులు ఉన్న కోరమాండల్ రైలులో విశాఖపట్నానికి ఎంత మంది రిజర్వేషన్ చేసుకున్నారన్న వివరాలు తప్ప మరే ఇతర వివరాలూ రైల్వే శాఖ వద్ద లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. అంతేకాకుండా ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన 245 మందితో బయలుదేరిన ప్రత్యేక రైలు ఎప్పుడు విశాఖ చేరుకుంటుందన్న దానిపై రైల్వే అధికారులకూ, జిల్లా అధికార యంత్రాంగానికీ సమన్వయం లోపించింది. రైల్వే శాఖ అధికారులు ట్రైన్ శనివారం సాయంత్రం 5:30 గంటలు వస్తుందని చెప్పగా కలెక్టరేట్ యంత్రాంగం రాత్రి 7:30కి వస్తుందని పేర్కొంది. వాస్తవానికి ప్రత్యేక రైలు సాయంత్రం 4 గంటలకు విశాఖ చేరుకొని అక్కడి నుంచి విజయవాడ వెళ్లిపోయింది. రైల్వే అధికారులు 45 మంది విశాఖ ప్రయాణికులు ప్రత్యేక రైలులో ప్రయాణిస్తున్నారని తెలపగా కేవలం 10 మంది మాత్రమే ట్రైన్ నుంచి దిగారు. వారిని ప్రధాన మార్గం నుంచి కాకుండా పక్క మార్గం నుంచి రైల్వే అధికారులు తరలించడంతో అధికారుల చర్యలపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమయ్యాయి. రైల్వే అధికారులు స్వల్ప గాయాలు అయినవారిని మాత్రమే ప్రత్యేక రైలు ద్వారా తరలించామని, వారందరూ క్షేమంగా ఇంటికి చేరుకున్నారని ప్రకటించగా, బి 5 కోచ్‌లో సీట్ నెంబర్లు 27, 29లో ప్రయాణించిన ఇద్దరు ప్రయాణికులను విశాఖపట్నంలో సెవెన్ హిల్స్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్టు మంత్రి బొత్స తెలిపారు. ఇలా రైల్వే, ప్రభుత్వ అధికారులు, నాయకుల తీరు పరస్పరం భిన్నంగా ఉంది.

ప్రత్యేక రైలులో విశాఖ చేరుకున్న కోరమాండల్ రైలు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

తీవ్ర అసహనం

శనివారం విశాఖ మీదుగా వెళ్లాల్సిన సుమారు 60 ట్రైన్లను రద్దు చేయడంతో ఈ ట్రైన్లలో రిజర్వేషన్ చేసుకుని ప్రయాణించాల్సిన వారు ఇబ్బందులుపడ్డారు. ఏ ట్రైన్లు రద్దు అయ్యాయో, ఏ ట్రైన్లు నడుస్తున్నాయో వివరాలు తెలిపే నాథుడే కరువయ్యాడు. పలు రైళ్లు నడుస్తున్నట్టు ఆన్‌లైన్‌లో చూపించినప్పటికీ ఆ రైళ్లు రద్దు అయ్యాయని అధికారులు చెబుతుండటంతో కొందరికి కోపం చిర్రెత్తుకొచ్చింది. సరైన సమాచారం ఇవ్వాలంటూ పలువురు నిలదీశారు.

మృతుల్లో విశాఖ వాసులు ఉండే అవకాశం

ఈ రైలు ప్రమాదంలో విశాఖపట్నం వాసులు ఉండే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రైలు ప్రమాదానికి గురయ్యే సమయానికి విశాఖపట్నంలో దిగాల్సిన 110 మంది రిజర్వేషన్ చేయించుకుని ఉన్నారు. వారిలో ఎంతమంది క్షేమంగా ఉన్నారనే సమాచారం ఇటు రైల్వే అధికారులవద్దగానీ, అటు ప్రభుత్వ యంత్రాంగం వద్దగానీ లేదు. పైపెచ్చు విశాఖకు చెందిన 76 మంది ఫోన్లు స్విచాఫ్ వస్తున్నట్టు సమాచారం. దీంతో వారి కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

రైలు ప్రమాద మృతులకు నివాళి

విశాఖ కలెక్టరేట్ : రైలు ప్రమాదానికి గురై మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి రూ.25 లక్షలు చొప్పున ఇవ్వాలని విశాఖ పౌర, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళ్లర్పిస్తూ శనివారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వారు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రైల్వే శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌర ప్రజాసంఘాల సమన్వయకర్త పి.చంద్రశేఖర్, ఐఎఫ్‌టియు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎం.వెంకటేశ్వర్లు, మహిళా చేతన కార్యదర్శి కత్తి పద్మ, మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.రవి, ఫ్యాప్టో మాజీ చైర్మన్ బి.వెంకటపతి రాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్, అరుణోదయ మహిళా సంఘం అధ్యక్షురాలు కె.నిర్మల పాల్గొన్నారు.

విశాఖ రైల్వేస్టేషన్ వద్ద ఎఐవైఎఫ్ ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ వై.రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఉల్లం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రమాద విచారణ కేంద్రం

ఒడిశా రైలు ప్రమాద ఘటన దృష్ట్యా సిఎంఒ కార్యాలయం ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విచారణ కేంద్రం ఏర్పాటు చేశారు. 0891-2590100, 0891-2590102, 9154405292 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు.

సెవెన్ హిల్స్‌లో ఇద్దరికి చికిత్స

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విశాఖ నగరానికి చెందిన ఇద్దరు శనివారం సాయంత్రం స్థానిక సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో వైద్య సేవల కోసం చేరారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.వాసుదేవరావు తెలిపారు. ఆసుపత్రిలో చేరిన వారిలో బి 5 కోచ్ సీటు నెంబర్ 27లోగల ప్రయాణికుడు లోకేష్ వెన్నెముకకు గాయమైంది. అదే కోచ్‌లో సీటు నెంబర్ 29కి చెందిన ప్రయాణికురాలు మణి తలకు దెబ్బతగిలింది. వీరిద్దరూ భువనేశ్వర్ నుంచి విశాఖకు ప్రయాణిస్తూ ప్రమాదంలో గాయపడ్డారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరిద్దరినీ మెరుగైన చికిత్స కోసం సెవెన్‌హిల్స్ ఆసుపత్రికి తరలించారు.

అదనపు ఆదాయం.. రూ.67.28 కోట్లు

- ఉమ్మడి విశాఖపై భూ మార్కెట్ విలువ పెంపు ప్రభావం

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు హెచ్చుకానున్న ఆదాయం

- పాడేరులో ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్ సేవలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో భూముల మార్కెట్ విలువ పెంచడంతో ప్రభుత్వానికి గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది అదనంగా రూ.67.28 కోట్లు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. స్పెషల్ రివిజన్ పేరుతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 20 నుంచి 25 శాతం వరకు విలువను సర్కారు పెంచింది. ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరుగుతున్న ప్రాంతం, మార్కెట్ విలువకు, బయట ధరలకు మధ్యవున్న వ్యత్యాసాలు, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు, అభివృద్ధి జరుగుతున్న ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొని ఈ మార్కెట్ విలువను పెంచింది. మూడేళ్ల మార్కెట్ విలువను, ప్రస్తుత ప్రయివేటు మార్కెట్‌ను ప్రాతిపదికగా తీసుకొని విలువను ప్రభుత్వం ఇలా పెంచుతూ నిర్ణయించింది. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి గతేడాది కంటే ఈ ఏడాది రూ.67.28 కోట్ల వరకు అదనంగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.

త్వరలో పాడేరు డివిజన్‌లోని 11 మండలాలకు రిజిస్ట్రేషన్ల సేవలు అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతంలోని నియమ నిబంధనలను దృష్టిలో ఉంచుకొని రిజిస్ట్రేషన్ సేవలందించేందుకుగాను పాడేరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఇప్పటికే అనుమతి లభించింది. అనంతగిరి మండలంలోని నాన్ షెడ్యూల్ ప్రాంత పంచాయతీలు, 11 మండలాల్లోని షెడ్యూల్ ప్రాంత రిజిస్రేషన్లు పాడేరులో జరగనున్నాయి. గతేడాది విశాఖపట్నం జిల్లా నుంచి రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.905.78 కోట్లు, అనకాపల్లి జిల్లా నుంచి రూ.251.64 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం జిల్లాలోని 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రూ.1307.83 కోట్లు, అనకాపల్లి జిల్లాలోని 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రూ.370.57 కోట్ల ఆదాయం రానుంది.

వ్యత్యాసాల ఆధారంగా సవరించాం

ప్రయివేటు మార్కెట్, ప్రభుత్వ మార్కెట్ విలువ వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకొని విలువను సవరించాం. రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో క్రయవిక్రయాలు ఎక్కువుగా జరిగే 20 నుంచి 25 శాతం ప్రాంతంలో మార్కెట్ విలువ పెరిగింది. పాడేరులో రిజిస్ట్రేషన్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

జి.బాలకృష్ణ, డిఐజి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు శాఖ

భద్రతలో విశాఖ పోర్టుకు అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2023 సేఫ్టీ అవార్డులలో విశాఖపట్నం పోర్టు అథారిటీ విన్నర్ అవార్డును కైవసం చేసుకుంది. సేఫ్టీ ఎక్స్‌లెన్స్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచినందుకు పోర్టును ఈ అవార్డు వరించింది. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని గ్రీన్ టెక్ ఫౌండేషన్ సంస్థ న్యూఢిల్లీలో నిర్వహించింది. సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల ప్రాణాలను కాపాడటం, సంస్థ పురోగతికి, ప్రమాద ఘటనలను సమర్థవంతంగా నిరోధించడం విషయంలో చేపట్టే చర్యలను పరిశీలించి ఏటా గ్రీన్ టెక్ సంస్థ ఈ అవార్డులను ప్రదానం చేస్తుంది. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ సిఎంఇ రవికుమార్, సేఫ్టీ అధికారులు గ్రీన్‌టెక్ అవార్డు స్వీకరించారు. పోర్టుకు అవార్డు రావడం పట్ల ఈ ఘనతను సాధించిన సిబ్బందిని పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందించారు.

మానవ హక్కుల చట్టంలోని సెక్షన్ 30ని సవరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మానవ హక్కుల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 30ని సవరించాలని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో డిపెండర్స్, వాలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్షన్ 30 కారణంగా ప్రజలకు న్యాయం జరగదన్నారు. విద్యా, వైద్య విధానాలు సమూలంగా మార్పు చేసి పేదలకు ఉచితంగా వీటిని అందివ్వాలన్నారు. బాధితుల హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వీరికి సత్వరం న్యాయం అందాలని అన్నారు. పార్లమెంటు, శాసనసభల్లో ఈ విషయంపై చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయిలోని మానవ హక్కుల కమిషన్ కర్నూలులో కంటితుడుపుగా ఉందని, బాధితులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 5న పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఎస్.కోటలో తమ వెయ్యి మంది వాలంటీర్లతో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యుడు సూర్య శ్రీనివాస్, ఎస్‌వి.రమణ, ప్రసాద్, గుండు అప్పలరాజు, విఎస్‌ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.